# పాము-ముంగిస



ఒక సాహిత్య సభ ముగించుకుని ఇంటికి చేరేసరికి పదిగంటలయింది. ఇంట్లోకి సాంతం వెళ్లకుండానే శ్రీమతి ఎదురొచ్చి "మీ కోసం కిషోర్ గారమ్మాయి చాలా సేపట్నుంచీ కూర్చుంది... వాళ్ల నాన్నగార్ని ఆస్పత్రిలో చేర్పించారట..." అంది ఆదుర్దాగా.

"ఏమైంది?" అనడిగాను కంగారుగా

నా గొంతు విని, నా మిత్రుడు కిషోర్ గారమ్మాయి బయటకొచ్చి "అంకుల్! నాన్నగారికి సీరియస్‌గా ఉంది. మీరు వెంటనే రావాలి..." అంది రుద్ధకంఠంతో.

"పదమ్మా..." అని బయట్నుంచే ఆ అమ్మా

యిని స్కూటర్ మీద ఎక్కించుకుని, ఆస్పత్రి వైపు దారితీసాను.

కిషోర్‌గారూ నేనూ ఒకే డిపార్టుమెంటులో పదహారేళ్లు కలిసి పని చేసాం. ఆ తర్వాత ఆయన అందులోనే రిటైరయ్యే వరకు పని చేసాడు. నేను ఉద్యోగం మారి ఉన్న ఊళ్లో స్థిరపడ్డాను. రిటైర్మెంటు తర్వాత, మా ఇంటికి సమీపంలోనే ఇల్లు కట్టుకుని కాలక్షేపం చేస్తున్నారు కిషోర్‌గారు. పిల్లల బాధ్యత అంతా తీర్చుకున్నారు. తరచూ మా యింటికి వస్తూ పోతూ ఉంటారు. మనిషి నిరాడంబరుడు. అల్ప సంతోషి. దైవభక్తిపరుడు, మితభాషి. అందువల్ల ఆయన అంటే నాకు చాలా ఇష్టం.

ఆయన పెద్దకూతురు జయశ్రీ. చదువుల సరస్వతి. జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా పని చేస్తోంది. నా పట్ల చాలా గౌరవాభిమానాలు చూపిస్తుంటుంది.

ఆలోచనల్లోనే ఆస్పత్రికి వచ్చేసాం.

వెతుక్కుంటూ వార్డులోకి వెళ్లాం. కిషోర్‌గారు సగం మగతలో ఉన్నారు. మెదడు నరాలలో రక్తప్రసరణ సరిగా అవటం లేదట. ఆపరేషనుకి అన్నీ సిద్ధం చేసారు. నాతో ఆ మగతలోనే మాట్లాడారు. నన్ను గుర్తుపట్టారుకూడా. ఆయన్ను ఆ స్థితిలో చూస్తే, నాకు చాలా బాధ కలిగింది.

"అంకుల్! ఒకసారి డాక్టరుగారితో మాట్లాడండి. ముఖ్యంగా ఆపరేషను ఖర్చులు విషయం కనుక్కోండి" అంది జయశ్రీ.

అప్పుడే డాక్టరుగారొచ్చారు.

వివరాలు అడిగాను.

"షుమారు పద్దెనిమిది వేలు అవుతుంది. బ్రెయిన్ ఆపరేషను కదా?" అన్నారు.

నేను జయశ్రీ వంక చూసాను.

"సరే కానీయండి" అన్నట్లు చూపులతోనే జవాబిచ్చింది.

ఆపరేషనుకి లోపలికి తీసుకెళ్లారు. నేను జయశ్రీ నడిగాను "డబ్బు విషయం ఏమి"టని. నిబ్బరంగా చెప్పింది. "నా ఫ్రెండ్స్ దగ్గర తెచ్చాను. తర్వాత బంగారం తాకట్టు పెట్టి ఇస్తాను".

ఆడపిల్ల అయినా, జయశ్రీ చూపిన చొరవకి, నిబ్బరానికి చాలా సంతోషించాను.

ఆపరేషను విజయవంతంగా జరిగింది.

కిషోర్‌గారిని వార్డులో పడుకోబెట్టారు.

కాస్సేపు ఉండి, ఇంటికి వచ్చేసాను.

కిషోర్‌గారు క్రమేపీ కోలుకుంటున్నారు. నేను శ్రీమతితో వెళ్లి చూసి వచ్చాను.

ఈలోగా జయశ్రీ ఆదుర్దాగా నాతో ఒక విషయం చెప్పింది. ఇప్పటికే రకరకాల వంకతో ఇరవైవేల రూపాయల దాకా ఆస్పత్రిలో వసూలు చేసారట! ఇంకొక ఇరవైవేలు దాకా ఇవ్వాలని చెప్పారట!

నేను అవాక్కయ్యాను.

"మరి ఆ రోజు డాక్టరు పద్దెనిమిదివేలవుతుందని చెప్పాడుగా?" అన్నాను తేరుకుంటూ.

"ఆమాటే అడిగాను. కానీ ఎ.సి.కి, నర్సింగ్‌కి, ఇంకా టెస్టులకి రూపాయికి రెండు రూపాయలుగా దబాయించి మరీ వసూలు చేసారు!" అంది.

కేఆర్టీ

ఆ అమ్మాయి పరిస్థితి నాకు ముందే తెలుసు. ఆడపిల్ల అయినా కొడుకు కంటే అధికంగా, బాధ్యతగా చేస్తోంది.

ఇప్పటికే అప్పుచేసి పీకదాకా మునిగి పోయింది.

రేపు మరొక ఇరవైవేల రూపాయల బిల్లు కట్టాలంటే సాధ్యమా? ఈ డాక్టర్లెంత ఘోరంగా ప్రవర్తిస్తున్నారు! బందిపోట్లే నయమనిపిస్తున్నారే! చెప్పేమాటకీ, ఆచరణకీ పొంతనలేదు! ఇలాంటి పరిస్థితే వాళ్లకి కలిగితే! - అనేక విధాల ఆలోచించాను. పరిష్కారం తోచలేదు.

యధాలాపంగా గోడమీద పెయింటింగ్ చూసాను. 'ముంగిస-పాము' పోరాటం! వెంటనే మెదడులో తళుక్కుమని చక్కని పరిష్కారం మెరిసింది.

'నువ్వు ఆస్పత్రికెళ్లు... రేపు అన్నీ చక్కబడతాయిలే" అన్నాను. అర్థంగానట్లు అయోమయంగా చూస్తూ వెళ్ళిపోయింది జయశ్రీ.

ఆ మర్నాడు నా క్లాస్‌మేట్ ఇన్‌కంటాక్స్ ఆఫీసరు కృష్ణారావుతో కలిసి బిల్లు చెల్లించటానికి వెళ్లాను. విషయమంతా ముందే వాడికి చెప్పాను.

డాక్టరు లెక్క చూసి పద్దెనిమిది వేలకి బిల్లు వేసి, రెండు వేలు వెనక్కి ఇచ్చేసాడు! ●




విశాఖపట్నంలో బిల్డర్స్ అసోసియేషన్ హాలులో కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారి జయంత్యుత్సవ వేడుకగా విశాఖ సాహితి, తెలుగు భాషా సంవర్ధన సమితి, భారతీయ శిక్షణమండల్ సంయుక్తంగా నిర్వహించిన సాహితీ సదస్సులో 'శ్రీ విశ్వనాధ వారి నవలా సాహిత్యంలో సామాజిక దృక్పథం'పై ప్రసంగిస్తున్న ఆచార్య కోవెల సంపత్కుమారాచార్య. వేదికపై ఆచార్య దుగ్గిరాల విశ్వేశ్వరం, ఆచార్య గణపతిరాజు నరసింహరాజు, సభాధ్యక్షులు డా॥ గుమ్మళ్ల ఇందిర ఉన్నారు.